క్లుప్తంగా

భగవద్గీతపై ప్రజలకు అవగాహన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక వనపర్తి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక వనపర్తి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాంలు, సురేష్, నాగరత్నం, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బద్రి, శివమ్మ, లక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి



పాన్‌గల్: బాలల హక్కులకు భంగం కలిగించకుండా వారు స్వేచ్ఛగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌వీకే మండల కోఆర్డినేటర్ లలిత అన్నారు. సోమవారం మండలంలోని వెంగళాయిపల్లిలో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎలా ఎదగాలనేది, రక్షణ లేని పిల్లల గురించి, సమాన విద్య, సమాజంలో గౌరవం, అభివృద్ధి అనే అంశాలపై చాట్ ద్వారా పిల్లలకు హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్ అవగాహన కల్పించారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సోమవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకొని పనులకు హాజరు కావాలన్నారు. పనుల వద్ద నీడ టెంట్లు, నీరు ఏర్పాటు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శి, కూలీలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్థానిక సర్పంచ్ జయరాములుసాగర్, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఉపాధ్యాయుల సూచనల మేరకు ప్రణాళికబద్ధంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పరీక్షలపై ఆందోళన చెందకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి స్థల పరిశీలన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో నూతనంగా నిర్మించనున్న శివాలయం కోసం గ్రామస్తులు, వాస్తు ప్లానర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే భూమిని చదును చేసి శివాలయం నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి నూతనంగా నిర్మించనున్న ఆలయానికి విరాళాలు అందజేయాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెబ్బేరు: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ప్రభుత్వ విద్య సాధన కోసం పనిచేసే వారిని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ శివార్చక విజయ్‌కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు కోరారు. పెబ్బేరు మండలంలో పలు పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో చేశారు.

పరిశుభ్రత పాటించాలి

మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందంచే విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, విద్య ప్రాధాన్యత వంటి పలు అంశాలతో కూడిన విషయాలను కళా బృందం వారు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, పీఈటీ రామచంద్రమ్మ, సారథి బృందం అధ్యక్షురాలు సువర్ణ, కళాకారులు శ్రీనివాసులు, డప్పు నరసింహ, గుడిసె లింగమయ్య, కృష్ణయ్య, బోనాసి రాజు, రాధ, శ్రీదేవి ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



కొత్తకోటలో మాట్లాడుతున్న ఆల మంజుల



వనపర్తిలో చెన్నపద్మను సన్మానిస్తున్న నాయకులు

కొత్తకోట: స్త్రీలకు ఆర్థికంగా స్వాతంత్రం లభించినప్పుడే వారు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధిస్తారని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల అన్నారు. ఈ నెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గుంత మౌనిక ఆధ్వర్యంలో వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆల మంజుల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా దినోత్సం మహిళలు మాత్రమే నిర్వహించుకునేది కాదని, మహిళల హక్కులను గుర్తించడం, వారికి సమాన స్థాయి, సమాన హోదా కల్పించే ఆలోచనను పెంపొందించుకునేందుకు నిర్వహించుకుంటున్నామని చెప్పారు. భారత రాజ్యాంగం మహిళలు, పురుషులకు సమాన హక్కులు కల్పించిందన్నారు. మహిళల జనాభాలో సగానికి పైగా ఉన్నా వారికి హక్కులు అందడం లేదని వాపోయారు. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, ఇంకా రాణించాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. స్త్రీల అక్షరాస్యతను పెంచి అన్ని రంగాల్లో వారికి తగిన అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం మహిళలు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్మన్ సుఖేశిని, మహిళా సర్పంచులు, ఎంపీటీలు పాల్గొన్నారు.

చెన్నపద్మకు ఘనంగా సన్మానం

వనపర్తి టౌన్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయురాలు చెన్న పద్మను పద్మశాలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు పద్మశాలి వర్కింగ్ ప్రెసిడెంట్ నీలి నారాయణ మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తూ, సావిత్రిబాయి పూలే అవార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారని గుర్తుచేశారు. ఉపాధ్యాయ రంగంలో మహిళా ఉపాధ్యాయురాలకు ఆదర్శంగా నిలిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా చెన్నపద్మ మాట్లాడుతూ... బాలికలకు నేటికీ బాల్యవివాహాలు చేస్తున్నారని, వాటిని అరికట్టి బాలికల ఆశయాలను వారి తల్లిదండ్రులు గౌరవించాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలప్ప, కోశాధికారి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షుడు మాణిక్యం, సలహాదారులు కొండలు, కమిటీ సభ్యులు శ్రీను, వెంకట్, వేణు, పుజల శ్రీను పాల్గొన్నారు.

ఆత్మకూర్: మహిళలు ప్రభుత్వం అందించే రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ బీఎన్‌కే రమేష్, మెప్మా డీఎంసీ బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలతో సమావేశమయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు మున్సిపాలిటీ పరిధిలో ఆర్థికంగా రాణించిన మహిళలకు సన్మానం చేస్తామన్నారు. పురపాలిక పరిధిలో 162 సంఘాలు ఉండగా 2,162 మంది సభ్యులు కొనసాగుతున్నారని తెలిపారు. సమావేశంలో మహిళా కౌన్సిలర్లు మహేశ్వరి, యాదమ్మ, నాగలక్ష్మి, తబస్సూంమోసీన్, అధ్యక్షురాలు ఉమాదేవి, కార్యదర్శి మంజుల, సంఘాల సభ్యులు, ఆర్పీలు ఉన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ కృష్ణయ్య

కొత్తకోట: పట్టణంలోని భారతి విద్యామందర్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు చేసిన విజ్ఞాన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు 50కి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రదర్శనలో భాగంగా థింక్ ఇండియా ఫెస్టివల్ సందర్భంగా దేశ సంస్కృతి, భాష, అభివృద్ధి, భిన్నత్వంలో ఏకత్వం, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సాధించిన ప్రగతి, విజ్ఞాన శాస్త్రం వంటి అంశాలపై విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఈ విజ్ఞాన మేళాను మండల విద్యాధికారి కృష్ణయ్య సందర్శించి విద్యార్థులను అభినందించారు. ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సహస్వీరెడ్డి, కరస్పాండెంట్ నరేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్‌కు గుణపాఠం



మాట్లాడుతున్న చింతలపల్లి జగదీశ్వర్‌రావు

పాన్‌గల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని శాగాపూర్ తండా, చిక్కేపల్లి గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసే సంక్షేమ పథకాల గురించి, రాహుల్ గాంధీ జోడో యాత్రకు సంబంధించిన సందేశ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రైతుల రుణమాఫీ, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూ పంపిణీ వంటి హామీలు నేటికీ అమలు కాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని, మహిళలకు రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కింద రూ.5లక్షలు సాయం, ఉద్యోగాల భర్తీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో ఆయన మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పనికి తగ్గ కూలీలు అందడంలేదని పలువురు కూలీలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, కృష్ణ, రాము, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నర్సింహానాయుడు, స్వామి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, చంద్రయ్య, శివానందం, చంద్రశేఖర్‌యాదవ్, నాగేష్‌నాయక్, రోహిత్‌సాగర్, శ్రీను పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలని వినతి

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని, వాటిని అడ్డుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తీనేటి రవీందర్‌రెడ్డి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్లు 42, 43/అ, 43/ఆ లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో మొత్తం 242 ప్లాట్లకు గాను కేవలం 92 ప్లాట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు ఉన్నాయని, మిగిలిన 152 ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు ఇంకా కాలేదన్నారు. రిజిస్ట్రేషన్ లేని ప్లాట్లలో ఇంటి నిర్మాణం, విద్యుత్ కనెక్షన్, నల్లాల కోసం పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ అనుమతి ఇచ్చారన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు పరిశీలించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

కాముడి దిష్టిబొమ్మకు శవయాత్ర



అమరచింతలో కాముడి దిష్టిబొమ్మ వద్ద రోధిస్తున్న గ్రామస్తులు



ఆత్మకూర్‌లో..

అమరచింత: పట్టణంలోని జగన్‌వాడకు చెందిన ప్రజలు ప్రతి ఏడాది హోలీ పండుగకు ముందు రోజు కామప్ప దహణ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. కాలనీకి చెందిన ప్రజలు, మహిళలు కామప్ప పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం కాముడి దిష్టి బొమ్మతో శవయాత్ర నిర్వహించారు. పట్టణంలోని వీధుల వెంట పాడెతో తిరుగుతూ ఆడవేషంలో ఉన్న వ్యక్తి తన భర్త చనిపోయాడమ్మ అంటూ రోదిస్తూ యాచించారు. వచ్చిన డబ్బులతో కాలనీ ప్రజలంతా చేరి కట్టెలను పేర్చి కాముడి దిష్టి బొమ్మను అందులో వేసి దహనం చేస్తారు. అదే నిప్పులపై గుగ్గీలనను ఉడికించి, వాటిని ప్రసాదంలా ఆరగించారు. ఇలాంటి వింత ఆచారంపై కాలనీ వాసులను అడుగగా తాత, ముత్తాతల కాలం నుంచి ఇదే ఆచారం ఉందని, వీటిని క్రమం తప్పకుండా కొనసాగించడమే తమ కర్తవ్యమంటున్నారు. కాముడి దిష్టిబొమ్మ శవయాత్రలో చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: హోలీ సంబరాల్లో భాగంగా స్థానిక శ్రీవాణి హైస్కూల్లో విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ పండుగ ప్రాముఖ్యత, వాడాల్సిన రంగులు, ఇతర విషయాల గురించి పాఠశాల చైర్మన్ టీజే విశ్వేశ్వర్ విద్యార్థులకు వివరించారు.

‘ప్రేరణ’తో ఆత్మస్థైర్యం

వీపనగండ్ల: పదో తరగతి విద్యార్థులకు ప్రేరణా తరగతులు నిర్వహించడంతో వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది, మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం తూంకుంట ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ప్రేరణా తరగతుల్లో సూచించిన అంశాలను పాటిస్తూ.. పరీక్షల్లో ఉన్నత ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులు అధిక మొత్తంలో 10 జీపీఏ సాధించినప్పుడే పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోహన్, సీఆర్పీ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కేశవులు, చంద్రశేఖర్, శ్రీనివాసమూర్తి, శ్రీధర్ పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ గడ్డి విత్తనాలు

వీపనగండ్ల: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశుగ్రాస కొరతను నివారించేందుకు గడ్డి విత్తనాలను మండల పశువైద్య కార్యాలయంలో సిద్ధంగా ఉంచినట్లు పశువైద్యాధికారి శ్యాం తెలిపారు. ఎస్‌ఎస్‌జీ 898 రకం పశుగ్రాసం విత్తనాలు 500 కేజీలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు వీటిని తీసుకోవాలని సూచించారు. గడ్డి విత్తనాలు పొందాలనుకునే రైతులు ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకంతో పాటు పశువైద్య కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హోలీని శాంతియుతంగా జరుపుకోవాలి

కొత్తకోట: పట్టణ, మండల ప్రజలు మంగళవారం నిర్వహించే హోలీ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని కొత్తకోట ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ర్యాలీలో ఎటువంటి పార్టీలకు సంబంధించిన నినాదాలు చేయొద్దని, ఎవరి మీద బలవంతంగా రంగులు చల్లరాదని సూచించారు. రోడ్లపై వెళ్లే వాహనదారులకు ఎటువంటి ఆటంకం కలిగించొద్దని కోరారు. సాంప్రదాయ రీతిలో హోలీ పండుగను జరుకోవాలన్నారు.

పాన్‌గల్: హోలీ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నాగన్న మండల ప్రజలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యాధులకు కారణమయ్యే రంగులను చల్లుకోకుండా సంప్రదాయ పద్ధతిలో చేసిన రంగులను వాడాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ మోటార్ల చోరీ: కేసు నమోదు

పెబ్బేరు: మండలంలోని బునాదిపురం, అయ్యవారిపల్లి, బూడిదపాడు గ్రామాల్లో 8 విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు సోమవారం రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూరాల కాల్వపై బిగించిన బునాదిపురం గ్రామానికి చెందిన ఇద్దరి రైతుల మోటార్లు, బూడిదపాడుకు చెందిన ముగ్గురు రైతుల మోటార్లు, అయ్యవారిపల్లి శివారులో మూడు మోటర్లు దొంగతనం చేసినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు.

పదోన్నతులు చేపట్టాలి

పాన్‌గల్: న్యాయపరమైన చిక్కులను అధిగమించి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు కల్పించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని శాగాపూర్, కదిరెపాడు, చిక్కేపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. పాలమూరు– రంగారెడ్డి– హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై అంకితభావంతో పనిచేసే ఆయనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. మధుసూదన్, రామచంద్రయ్య, సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని ముందరితండా పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మెగావత్ ఠాకూర్‌నాయక్(51) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్మికుల సంఘం అసోసియేషన్ సభ్యులు సోమవారం ముందరితండాకు చేరుకొని ఠాకూర్‌నాయక్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గట్టమ్మ, వెంకటయ్య, మజీద్, రాజు, రాధమ్మ, చెన్నమ్మ, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరుకు చెందిన కాలూరు చిన్న కుర్మయ్య కొంత కాలం నుంచి పెరాలసిస్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందిన విషయం తెలుసుకున్న జూపల్లి అనుచరులు వారి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి నివాళ్లర్పించారు. చిన్న కుర్మయ్య కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి దహన సంస్కారాలకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించినట్లు బీచుపల్లి యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు తగరం లక్ష్మయ్య, వడ్డెమాన్ బిచ్చన్న, తగరం శ్రీనివాసులు, కత్తి జాని, బాబు, నాని, శేషన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాల్లో ఉపాధి పథకం కొనసాగించాలి



మాట్లాడుతున్న వెంకట్రాములు

అమరచింత: గ్రామీణ ప్రాంతాల ప్రజలకే కాకుండా పట్టణ ప్రాంతాల్లో సైతం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించి, పట్టణ పేదలకు ఉపాధి కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మత్స్యకార భవనంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన వెంకట్రాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై చేస్తున్న కుట్రలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను నిర్వీర్యం చేయడం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్రం సిద్ధమైందని దుయ్యబట్టారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలోకి తేవడంపై ఆందోళన చేశారు. విద్యుత్ సవరణ చట్టం 2022ను సవరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై తమ హక్కులను కాపాడుకోనేందుకు ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పుట్ట ఆంజనేయులు, మేకల ఆంజనేయులు, బాల్‌రెడ్డి, అజయ్, రమేష్, వెంకటేష్, బుచ్చన్న, నర్సింహ, వెంకటేష్, రాజు, కాకి శ్రీను, అనంతమ్మ, హరికృష్ణ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణాల్లో నాణ్యత లోపించొద్దు



పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో నిర్మిస్తున్న నూతన డ్రెయినేజీ నిర్మాణాల్లో నాణ్యత లోపించకుండా నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని రెండో వార్డులో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాతో కలిసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



అప్పారెడ్డిపల్లి పాఠశాలలో ప్రచారం చేస్తున్న వరప్రసాద్

ఆత్మకూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీరెల్లి కమలాకర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వద్ద భోజన విరామంలో చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వగ్గురాఘవేందర్, విజయ్, విజయప్రకాష్ చారి తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించుకుందామని జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి, ఖిల్లాఘనపురం తదితర పాఠశాలల్లో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నాగేశయ్యతో కలిసి పర్యటించారు.

కంటి అద్దాలు పంపిణీ



గుంటిపల్లిలో కంటి పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ సుజాత

పాన్‌గల్: కంటి వెలుగులో పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు అవసరమైన అద్దాలను మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లిలో సోమవారం వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. దీంతో పాటు దావాజీపల్లిలో బుధవారం నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమంపై గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దావాజీపల్లి సర్పంచ్ వెంకటయ్య యాదవ్, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, సుమనశ్రీ, ఏఎన్‌ఎంలు సుమిత్ర, రేవతి, పంచాయతీ కార్యదర్శి విజయలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంతో అంధత్వ సమస్యలు తీరనున్నాయని ఏపీఎం శ్రీనివాసులు, సర్పంచ్ సుజాతప్రకాష్ అన్నారు. సోమవారం గుంటిపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు నిస్సార్‌అహ్మద్, రంజిత్‌రెడ్డి, శివలీల, దీపిక, నిఖిత, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు

చిన్నంబావి: విద్యార్థి జీవితంలో పాఠశాలలో గడిపిన సమయం అత్యంత ప్రాముఖ్యమైందని, జీవితంలో మంచి పౌరులుగా ఎదగాలని జెడ్పీటీసీ వెంకటరమణమ్మ, ఎంపీపీ సోమేశ్వరమ్మ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఓ రమాదేవి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వారు హాజరయ్యారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు ఆత్మవిశ్వాసంతో రాసి, వందశాతం ఉత్తీర్ణతతో సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు తగరం లక్ష్మి, చిన్నారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ డేగ శేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

ఆత్మకూర్: పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ శరత్, డాక్టర్ నిస్సార్‌అహ్మద్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అయ్యూబ్‌ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, వార్డెన్ మహమ్మద్‌రఫీ, వైద్యసిబ్బంది నాగలక్ష్మి, నర్సమ్మ, సిబ్బంది ఉన్నారు.

వంటగ్యాస్ ధర తగ్గించండి

అమరచింత: నిత్యావసర సరుకులతో పాటు వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను చీటికి మాటికి పెంచడమే కేంద్ర ప్రభుత్వ నైజంగా మారిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కొంకన్‌వానిపల్లిలో మహిళలతో కలిసి ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మల్లేష్, వరలక్ష్మి, సుజాత, మహేశ్వరమ్మ, బుచ్చమ్మ ఉన్నారు.

పార్లమెంటుపై ప్రతి పౌరుడికి గౌరవం ఉండాలి



వనపర్తి క్రైం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నైబర్ ఉడ్ యూత్ పార్లమెంట్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, భరతనాట్యం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వక్త కృష్ణప్రసాద్, జిల్లా యువజన అధికారి కోట నాయక్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి సమాజం కోసం తనవంతుగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో వలంటీర్‌గా కృషి చేయాలన్నారు. పార్లమెంటుపై అవగాహన, గౌరవం ప్రతి యువత కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ రాజేందర్, అభిలాష్, యువత పాల్గొన్నారు.